తేదీ 21-08-1992న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము

# దైవము నిరంతరము ప్రేమస్వరూపుడే!

ప్రేమ దైవంబు జగమెల్ల ప్రేమమయము
ప్రేమరూపము గొనివచ్చి పేర్మిమీర
ప్రేమసుధలను చిందించి ప్రేమగూర్పు
ప్రేమ అవతార! శ్రీకృష్ణ ప్రేమ తృష్ణ

ప్రేమస్వరూపులారా!

ప్రేమ మహావిలువైన వజ్రమువంటిది. ఈ ప్రేమ స్వార్థపరులదగ్గర క్షణమైనా నిలువజాలదు. అహంకారముదగ్గర ఆరక్షణమైనా వుండలేదు. ఆడంబరముల వారిదగ్గర యిది అసలే ప్రవేశించదు. స్వార్థ, అహంకార, ఆడంబరముల మొఖము యేమాత్రము చూడదు. ఈ ప్రేమ ఎక్కడ లభ్యమవుతుంది? ఈ విలువైన వజ్రము ప్రేమరాజ్యమునందే లభ్యమవుతుంది. ప్రేమమార్గమునందే యిది లభ్యమవుతుంది. ప్రేమ అంగడియందు మాత్రమే యిది మనకు లభిస్తుంది. ప్రేమ హృదయముతోనే మనకు ప్రాప్తిస్తుంది. ఐతే, యీ జగత్తంతయు ప్రేమమయమే కదా, యిట్టి ప్రేమయందు ప్రేమ ఎందుకు లభ్యము కావటం లేదు?

**సర్వార్పిత భావమునకే ప్రేమ లభ్యమవుతుంది**

ఈ జగత్తంతయు ప్రేమమయముగా భావిస్తున్నారుగానీ, యిది నిజమైన ప్రేమ కాదు. దేహ, యింద్రియ, మనో, బుద్ధుల సంబంధమైన జీవితము ప్రేమ అనిపించుకోదు. ఈ దేహ, యింద్రియ, మనో, బుద్ధులతో కూడినది కేవలము అనురాగమేగానీ ప్రేమ కాదు. ఆత్మజీవితమే నిజమైన ప్రేమ. కనుక మనం ఆత్మజీవులుగా భావించాలిగానీ, శరీర జీవులుగా యింద్రియ జీవులుగా మనో జీవులుగా బుద్ధి జీవులుగా జీవించరాదు. శరీర, యింద్రియ, మనో, బుద్ధులు ఉండినంతవరకు అహంకార మమకారములు, ఆడంబరము, స్వార్థము మానవుని విడిచి ఉండలేవు. ఇట్టి ప్రేమను పొందుటకు ఏ జపమో, ధ్యానమో,

sri sathyasaivachanamrutam

యోగమో, యజ్ఞమో, క్రతువో ఆచరించనక్కర లేదు. వీటివల్లకూడను ప్రేమ లభ్యము కాదు. కారణమేమనగా, యీ కర్మలందు అంతోయింతో స్వార్థము, స్వప్రయోజనము యిమిడి ఉంటున్నవి. కనుక, యజ్ఞమునకుగానీ యాగమునకుగానీ ధ్యానమునకుగానీ యోగమునకుగానీ యీ ప్రేమ లభ్యమయ్యేది కాదు. సర్వార్పిత భావమునకే యీ ప్రేమ సాధ్యమవుతుంది.

**అహంకారము, ఆడంబరము, స్వార్థము, స్వప్రయోజనము ఇవన్నీ చేరి భవరోగముగా రూపొందుతాయి**

కనుకనే కృష్ణుడు 'సర్వాధర్మాన్ పరిత్యజ్య' అన్నాడు. జీసస్‌కూడను యిదే విధమైన అర్థము వచ్చునట్లుగా I am the path అన్నాడు. బుద్ధుడుకూడను యిదే అర్థము వచ్చునట్లుగా 'ధర్మం శరణం గచ్ఛామి' అన్నాడు. అనగా సర్వమతముల సారము, సర్వశాస్త్రముల మూలము, సర్వ ధర్మములయొక్క గమ్యము సర్వార్పిత భావమే! అట్టి అర్పితము గావించుకున్నవారే గోపికలు. ఐతే, 'యీ ప్రాకృతమైన జగత్తునందు సర్వార్పితభావము సాధ్యమవుతుందా?' అని సందేహించవచ్చు. ఈ జగత్తులో కొంతవరకైనా స్వార్థముగానీ, స్వప్రయోజనముగానీ, అహంకారముగానీ, ఆడంబరముగానీ ఉండకుండా వుండుటకు వీలుకాదు. కానీ, దీనికికూడను ఒక పరిమితము ఉంటున్నది. 'నశ్రేయో నియమం వినా,' కొంత నియమము పాటించాలి. మన దేహములో ఉష్ణము ఒక పరిమితిలో ఉంటున్నాది. ఈ వేడి 98.4$^{0}$F లేదా 98.6$^{0}$F ఉంటున్నది. ఇది ఆరోగ్యం. కాని 99$^{0}$F చేరేటప్పటికి అనారోగ్యం చేరుతుంది. అదే విధముగనే మానవునికి స్వార్థం ఉండవచ్చును. కాని, ఎంతవరకో అంతవరకే స్వార్థము? అది మితిమీరిపోతే రోగంగా రూపొందుతుంది. అహంకారము ఒక రోగము, ఆడంబరము ఒక రోగము, స్వార్థము ఒక రోగము, స్వప్రయోజనము ఒక రోగము. కనుకనే, వీటన్నింటినీ చేర్చి 'భవరోగము' అని చెప్పారు. అనగా జగత్తునందు మనకు వ్యాపించే రోగములు యివన్నీ! అయితే, భగవంతుడు సర్వులయందు వుండినప్పటికీ సర్వార్థ భావము భక్తునియందు లేకుండిన యిది సార్థకమైన ప్రేమతత్త్వం కాదు. తనయందు భగవంతుడున్నాడని విశ్వసించవచ్చునేకాని యీ విశ్వాసము సరియైన

srisathyasaivachanamrutam

విశ్వాసం కాదు. నీయందు భగవంతుని చూడటం గొప్పతనం కాదు. భగవంతునియందు నిన్ను చూడాలి. అది సరియైన ప్రేమతత్త్వము. భగవంతునియందు నీయొక్క స్వరూప, లక్షణములు కన్పించకుండినంతవరకుకూడను నీవు స్వార్థపరుడివే! పరార్థతత్త్వంతో కూడినటువంటివాడవు కావు. కనుక, ప్రతి విషయమునందు యీ ప్రాకృతమైన జగత్తునందు ఒక పరిమితమైన భావమును గుర్తిస్తూపోవాలి.

**ఆనందము, ఆనందమయుడైన భగవంతునియందే లభ్యమవుతుంది**

ప్రతీ మానవుడుకూడా ఆనందం కావాలని ఆశిస్తున్నాడు. ఆనందం అంటే ఏమిటి? దీనినే వేదాంత పరిభాషలో 'యోగము' అన్నారు. యోగమనగా ప్రాణాయామం, ప్రత్యాహారం యిలాంటి కర్మలాచరించటం అని ఈనాడు భావిస్తున్నారు. యోగమంటే యిది కాదు, అర్థము. యోగమనగా ఆనందము అని అర్థము. ఈ ఆనందం ఎక్కడ మనకు లభ్యమవుతుంది? ఆనందమయుని దగ్గరనుండే మనకు లభ్యమవుతుంది. ఆనందం వస్తువాహనాదులయందుకాని, ఆహారవిహారములయందుకాని, ప్రాకృతమైన పదవులయందుకాని, స్థితిగతులయందుకాని, మనకు లభ్యము కాదు. ఈ ఆనందము ఆనందమయుడైన భగవంతునియందే మనకు లభ్యమవుతుంది. అయితే ఎప్పుడు యీ ఆనందం మనకు లభ్యమవుతుంది? మన శ్రీకాంత్ చెప్పాడు. గోపికలు, రాధ వీరందరు నిరంతరం ఏకాత్మభావంతో కృష్ణుడిని స్మరిస్తూ వచ్చారు. గోపికలనగా ఎవరు? రాధ అనగా ఎవరు? వీరిని కేవలము స్త్రీలుగా భావించి, అనేక విధములైన అపోహలు కల్గించి, అనర్థములను పెంచి, యథార్థమును విస్మరిస్తూ వస్తున్నారు. మన సంకల్పములే గోపికలు. సర్వసంకల్పముల కూడికయైన మనసే రాధ. మన సంకల్పములు, మన మనస్సు 'ప్రజ్ఞ' అనే కృష్ణునిలో కరిగిపోవాలి. అదే 'ప్రజ్ఞానం బ్రహ్మ' అన్నారు. ఈ ప్రజ్ఞానమనేది కేవలం మన శరీరమునందు, మనసునందు, బుద్ధియందు, అంతఃకరణయందు మాత్రమేకాక, సర్వత్రా వ్యాపించియున్నది. అనగా 'అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య ప్రజ్ఞా స్వరూపః.' యిట్టి ప్రజ్ఞనే 'బ్రహ్మ' అని పిలుస్తూ వచ్చారు. అనగా Constant Integrated Awareness. ఇట్టి ప్రజ్ఞయందు మన భావములు, మనస్సు, సంకల్పములు లీనమైపోవాలి.

srisathyasaivachanamrutam

## దైవప్రేమ నిస్వార్థ, నిర్వికల్ప, నిరంజన, నిత్య, నిర్గుణమైనది

యిలాంటి ప్రజ్ఞాస్వరూపుడైన భగవంతుడు సర్వత్రా వ్యాపించి వుండినప్పుడు, యీ అవతారములు ధరించటములో ఉన్న రహస్యమేమిటి? అయితే యీ అవతారములు ధరించటానికి కారణము లేకపోలేదు. 'ప్రత్యక్షం,' 'పరోక్షం' అని రెండు ఉంటున్నవి. 'అంతర్‌శక్తి,' 'బహిర్‌శక్తి' అని రెండు ఉంటున్నవి. 'అంతర్ భూతము,' 'బహిర్ భూతము' అని రెండు ఉంటున్నవి. కట్టెలయందు అగ్ని ఉంటుంది. కాని, ఆ అగ్ని అంతర్‌భూతమై ఉంటుంది. అంతర్గతమై ఉంటున్నది. అవ్యక్తమై ఉంటున్నది. కనుక, యీ కట్టెలపైన బియ్యం పెట్టి, ఆ కట్టెలపైన పాత్ర పెడితే బియ్యం అన్నముగా మారదు. ఆ కట్టెయందున్న అగ్ని ప్రత్యక్షంగా వచ్చినప్పుడే కట్టెలను కాల్చి, బియ్యమును ఉడికించి అన్నముగా రూపొందింప చేస్తుంది. ప్రతి దేహముకూడా ఒక కట్టెవంటిదే! ఈ కట్టెయందు అంతర్భూతమై ఉంటున్నది, ఆత్మతత్త్వము. దానిని ప్రత్యక్షం గావించుకునేనిమిత్తమై ప్రేమతత్త్వాన్ని మనం అనుభవించాలి. మరొక చిన్న ఉదాహరణ. మన చేతియందు అగ్గిపెట్టె ఉంటుంది. కాని, అది మన జేబులనేమాత్రం కాల్చదు. ప్రతీ పుల్లయందు అగ్ని ఉంటుంది. ఆ పుల్లను తీసి పెట్టెతో రాసినపుడు ఆ అగ్ని ప్రత్యక్షంగా మారుతుంది. ప్రత్యక్షంగా రూపొందిన ఆ అగ్ని తనను, తన చొక్కాను, తన జేబును సర్వమును కాల్చివేస్తుంది. అట్లనే మానవునియందు దివ్యత్వమనే ప్రేమతత్త్వంయొక్క జ్ఞానస్వరూపమైన ప్రకాశం ఉండినప్పటికీ దానిని ప్రత్యక్షం గావించుకోవాలంటే ప్రేమతో ప్రేమను చేర్చినపుడే ఆ ప్రత్యక్ష స్వరూపం మనకు సాక్షాత్కరిస్తుంది. అగ్గిపుల్లలో ఉన్న మందు ఒక్కటే. అగ్గిపెట్టెపైన ఉండిన మందు ఒక్కటే. రెండింటికి రాపిడి జరిపినపుడే అగ్ని మనకు గోచరమవుతుంది. తమయందున్న ప్రేమ, దైవమునందున్న ప్రేమ రెండూ ఒక్కటిగానే భావిస్తారు కొందరు. కాని, దైవముయొక్క ప్రేమ నిస్వార్థమైనది, నిర్వికల్పమైనటువంటిది, నిరంజనమైనటువంటిది, నిత్యమైనటువంటిది, నిర్గుణమైనటువంటిది. దీనికి విరుద్ధముగా వ్యక్తుల ప్రేమ స్వార్థమైనటువంటిది, స్వప్రయోజనమైనటువంటిది, గుణసహితమైనది. యిలాంటి ప్రేమతత్త్వముతో దివ్య ప్రేమతత్త్వము ఏమాత్రము కూడను కలియుటకు వీలుకాదు. కనుక, మానవునియందుండిన యీ అహంకార, ఆడంబర, అసూయ

srisathyasaivachanamrutam

స్వార్థాదులు ఏనాడు త్యజించునో ఆనాడే అందులో భగవంతుడు ప్రవేశిస్తాడు.

**గోపికలు తమ యింద్రియములన్నిటిని దైవార్పితభావముతో అనుభవిస్తూ వచ్చారు**

అది త్యాగము చేయక భోగములపైన మనసునుంచి విషయరాగములలో మునిగి తేలుతూ ప్రాకృతమైన జీవితము గడిపేంతవరకు నీవు ఎంత భక్తి నటించినప్పటికిని, ఎంత సర్వజ్ఞుడిగా నిన్ను నీవు భావించినప్పటికిని యిది కేవలము కృత్రిమమైన జీవితమేగానీ, నిన్ను నీవు మోసము చేసుకోవటమేగాని దైవముతో కూడే యోగము లేదక్కడ! ఈనాడు ప్రపంచమంతయు యీ గుణములతోనే నిండియున్నది. దైవాన్ని ప్రేమిస్తున్నామంటున్నారు. నిజముగా దైవము నిమిత్తమై దైవమును ప్రేమించే జీవుడు యింతవరకు ఎక్కడ కనుపించలేదు! తన నిమిత్తమై తాను దైవమును ప్రేమిస్తున్నాడుగానీ, దైవమునిమిత్తమై తాను దైవమును ప్రేమించటం లేదు. యిదే స్వార్థము. ఈ రుమాలు నిమిత్తమై నేను రుమాలును ప్రేమిస్తున్నానుగానీ నా నిమిత్తమై నేను రుమాలును ప్రేమించటంలేదు. ఈ జగత్తునందున్న సమస్త పదార్థములను తన ప్రయోజనము నిమిత్తమై ప్రేమిస్తున్నాడుకానీ, పదార్థముల నిమిత్తం ప్రేమించటం లేదు. అన్నీ తన స్వార్థమే!, స్వార్థమే! దైవాన్నికూడను తన స్వార్థముకోసం ప్రార్థిస్తున్నాడు. దైవము సామాన్యము కాదు. అంత సులభముగా లభ్యమయ్యేవాడు కాడు. నీ హృదయము ఒక్కరు కూర్చునే సింహాసనము వంటిది. యిది డబుల్ సోఫా కాదు, లేక మ్యూజికల్ ఛైర్ కాదు. ప్రాకృతమైన భావాలు యీ ఛైర్‌పైన కూర్చోపెట్టుకొని దైవమా యిందులో కూర్చోమంటే దైవము యే రీతిగా కూర్చోగలడు? దీనిని నీవు ఖాళీగా ఉంచినప్పుడే యిందులో భగవంతుడు ప్రవేశిస్తాడు. కనుక, యీనాడు ప్రేమ అనే పేరుతో నీవు మ్యూజికల్ ఛైర్ ఆడుతున్నావు. ఆ ఛైర్ ఒక్కరి స్వంతము కాదు. ఒకరు ఒకతూరి కూర్చోవచ్చు మరొకరు మరొక తూరి కూర్చోవచ్చును. కాబట్టి 'యిది నా స్వంతమ'ని చెప్పటానికి నీకు అధికారము లేదు. అట్టి అధికారము ఒక్క గోపికలకు మాత్రమే ఉన్నది. దానినే వారు ఆదర్శముగా నిరూపించారు. అనగా దైవభావములతో గోపికలు జీవించుతూ వచ్చారు. ప్రతి యింద్రియమును దైవార్పిత భావముతో వారు అనుభవిస్తూ వచ్చారు. తమ మాటలు దైవమాటలే! తమ స్మరణ దైవస్మరణే! తమ

sri sathyasai vachanamrutam

శ్రవణము దైవశ్రవణమే! తమ హస్తములు ఆచరించేవి దైవకర్మలే! ఇలా తమ సర్వేంద్రియములు దైవార్పితమైన భావముతో వారు అనుభవిస్తూ వచ్చారు. తమది అనేది వారియందు ఎక్కడా కనుపించలేదు. కృష్ణుడు మాత్రమే తమ వాడు! ఒక చిన్న ఉదాహరణము.

**నిరహంకారము, నిస్వార్థము ఒక్క గోపికలయందే ఉన్నది**

గోపికల భక్తి, ప్రపత్తులకు చక్కని సాక్ష్యముగా ఒక ఆదర్శమును నిరూపిస్తూ వచ్చాడు, కృష్ణుడు. మీకు అనేక పర్యాయములు చెప్పాను. ఒకానొక దినము కృష్ణుడు తనకు తలభారమని, నటిస్తూ వచ్చాడు. యీ తలనొప్పికోసం మందు కావాలని ఆశించాడు. సర్వజ్ఞుడైన కృష్ణుడు సర్వులు కూడిన సమయమునందే యీ లీలను ప్రకటనము గావిస్తూ వచ్చాడు. సత్యభామ, రుక్మిణి, జాంబవతి, నారదుడు వీరందరు సమీపములో ఉంటున్నారు. ఏ కించిత్ ఆహారము కృష్ణుడు స్వీకరించటం లేదు. చాలా నాటకం ఆడుతూ వచ్చాడు. 'యీ బాధను నేను భరించలేను' అన్నాడు. యీ దృశ్యమును చూచిన నారదుడు 'స్వామీ! దీనికి తగిన మందు ఎక్కడ ఉంటున్నది? చెప్పండి, తప్పక తెప్పిస్తాను,' అన్నాడు. 'ద్రేపల్లెకు వెళ్లి గోపికలయొక్క పాదధూళిని తీసుకు వచ్చి నా తలపైన పట్టు వేసిన నా తలనొప్పి పోతుంది' అన్నాడు కృష్ణుడు. 'పరమ భక్తులైనవారు, గోపికలు. ఆ పరమభక్తుల పాదధూళియే నా శిరోవేదన తగ్గిస్తుంది,' అని చెప్పాడు. యీ మాటలవల్ల నారదునిలోపల ఉండిన అహంకారము బయటకు వచ్చింది. 'స్వామీ! సతతం యోగినః! నేను నిరంతరము కృష్ణయోగములోనే ఉంటున్నాను. సర్వదా సర్వ కాలేషు సర్వత్ర కృష్ణ చింతనం. ఎక్కడకు వెళ్లినా నేను కృష్ణ చింతన చేస్తున్నాను. నాకంటే గొప్ప భక్తులుంటున్నారా యీ జగత్తులో?' అని ప్రశ్నించాడు. దీనిని అంగీకరించలేదు కృష్ణుడు. 'నీవు భక్తుడవే కావచ్చు, నారదా! కానీ ఆ గోపికలయొక్క పాదధూళియే నా శిరోవేదనను చల్లారుస్తుంది' అని చెప్పాడు. నారదుడు కొంత ప్రజ్ఞానము కలవాడు. తన తెలివితేటలనంతా మాటలలో చూపుతూ వచ్చాడు. అమితమైన తెలివిగలవానికి అమితమైన భాష ఉంటుంది. ఇంకా తెలివితేటలు కలవానికి ఎప్పుడూ సందేహాలే ఉంటుంటాయికూడా! ఎంత మేధాశక్తి తనలో కలదని

భావిస్తున్నాడో అంత అపశకునములుకూడను అతనిలో ప్రవేశిస్తూ ఉంటాయి. కృష్ణా! నాలో భక్తి తగినంత స్థాయిలో లేకపోవచ్చు. కాని, సత్యభామ నీ నిమిత్తమై జీవితాన్ని అంకితము చేసింది. ఆమె పాదధూళిని నీవు ధరించరాదా?' అన్నాడు. అప్పుడు సత్యభామ చెప్పింది, 'నారదా! నేను సతి, కృష్ణుడు పతి. సతి పాదధూళి పతి శిరస్సుపైన వేయటం ఎంత పాపము! నేను దానికి ఏమాత్రము అంగీకరించను. నేను పాపకూపములో పడటానికా యీ పని చేయటము?' అన్నది. అక్కడకూడను సత్యభామయందు పూర్తి స్వార్థమేర్పడిపోయింది! తన పాదధూళి భర్త శిరస్సుపై వేసినప్పుడు తాను పాపములో పడుతుందనే స్వార్థము వచ్చింది. సత్యభామ తన పాదధూళి కృష్ణుని తలపై వేయడానికి అంగీకరించలేదు. రుక్మిణికూడా యిదే భావమును పొందుతూ వచ్చింది. వారెవ్వరూ యివ్వలేదు. క్షణక్షణము కృష్ణుని బాధ అధికమవుతూ వచ్చింది. ఇక తప్పినది కాక నారదుడు వ్రేపల్లెకు వచ్చాడు. నారదుడు వచ్చిన తక్షణమే గోపికలంతా అతని చుట్టూ గుమిగూడారు. 'నారదా! మా కృష్ణుడు ఎట్లా ఉన్నాడు? ఎప్పుడు వస్తాడు, మా వ్రేపల్లెకు? యీ వార్తను చెప్పుమ'ని అడిగారు. 'కృష్ణుడు వచ్చే విషయము నాకు తెలియదు. ప్రస్తుతం కృష్ణుడు అమితమైన శిరోభారమును అనుభవిస్తున్నాడు. ఆ బాధ నివారణార్థము మందు నిమిత్తమై నేను యిక్కడకు వచ్చాను' అని చెప్పాడు. 'నారదా! కృష్ణుని శిరోబాధ నివారణ చేసే మందు మా వ్రేపల్లెలో ఉందా! ఆ మందు ఎక్కడ ఉందో చెబితే మేము తెచ్చి యిస్తా'మన్నారు, గోపికలు. 'మీ పాదధూళియే అతని శిరోభారము తగ్గించే మందు' అన్నాడు, నారదుడు. ఒక గోపిక వెళ్ళి దుప్పటి తెచ్చింది. గోపికలందరు తమ పాదధూళినంతా అందులో విదిలించారు. మూటకట్టుకున్నాడు, నారదుడు. బయలుదేరాడు. యిది వారి నిస్వార్థమునకు, నిర్మలత్వమునకు చక్కని ఉదాహరణము. 'మేము దాసులమే! మా పాదధూళి కృష్ణునికి యే విధముగా యివ్వాలి?' అనే యోచనే వారికి లేదు. 'కృష్ణుడు ఆనందముగా ఉంటే అంతే చాలు మాకు! అంతేకాని యిది, అది అని వాదోపవాదములు వేయటానికి మాకు అర్హత లేదు. మా జీవితమే అతనికి అర్పితమైనది. అతని ఆనందమే మా ఆనందము' అనే భావము కలిగినవారు, గోపికలు. యిలాంటి యేకాత్మభావముతో వీరు తమ పాదధూళిని యిచ్చిన తక్షణమే అక్కడ కృష్ణుని

sri sathyasai vahini

తలభారము నివారణైపోయింది! నారదుడు యీ పాదధూళి తీసుకొని వెళ్ళేటప్పటికి కృష్ణుడు నవ్వుతూ, నవ్వుతూ మాట్లాడుతున్నాడు. అప్పుడు చెప్పాడు కృష్ణుడు: 'నారదా! మీరు భక్తులము, భక్తులమని అహంకారపడుతున్నారు. ఆడంబరములతో జీవితమును గడుపుతున్నారు. స్వార్థముతో మీ జీవితమును భగవంతునికి అంకితము గావించినట్లుగా భావిస్తున్నారు. నిరహంకారము, నిస్వార్థము గోపికలయందు ఉన్నదిగానీ వేరెవరియందు లేద'న్నాడు.

**స్వార్థము, అహంకారము ఉండినంతవరకు భగవంతుని దృష్టి వానిపై పడదు**

యీనాడు లోకములో ప్రతి ఒక్కరు 'మేము భక్తులము, స్వామికి సన్నిహితులము,' అని భావిస్తున్నారుగానీ ఎవ్వరూ కాదు. ప్రతి ఒక్కరియందు అంతో యింతో స్వార్థము యిమిడి ఉంటున్నాది. యీ స్వార్థము, అహంకారము ఉండినంతవరకు భగవంతుని దృష్టి వానిపై పడదు. ఎట్లనగా సూర్యుడు ప్రకాశిస్తూ ఉన్నాడు. దట్టమైన మేఘములు అడ్డువచ్చినప్పుడు సూర్యుడు కనుపించడు, ఎవరికీ!. కానీ ప్రకాశము లేదా? ఉంది. మేఘములు అడ్డు తగలటంచేత ప్రకాశము కనపడకుండా ఉంది. అదే విధముగా దైవము నిరంతరము ప్రేమస్వరూపుడే! కాని ఆ ప్రేమకు అహంకారము, స్వార్థము అనేవి దట్టమైన మేఘములుగా అడ్డము రావటంచేత ఆ ప్రేమతత్త్వము దీనిపై ప్రసరించలేకపోతున్నది. మానవత్వములో ఉండిన దివ్యత్వమును గుర్తించటానికి ప్రేమతత్త్వమే ప్రధానమైన సాధనము. లోకములో ధనకనకవస్తువాహనాదులు, శక్తిని, భుజబలమును, బుద్ధిబలమును, ఆశ్రయించి అనేక విధములుగా అహంకారము పడుతూ ఉంటారు. కానీ, దైవానుగ్రహములేక యివన్నీకూడను వ్యర్థములుగా తోస్తాయి. భారతమునందు కృష్ణుడు అర్జునునకు, కర్ణునకు మధ్య ఉండిన భేదము నిరూపిస్తూ వచ్చాడు. యీ యిరువురి శక్తిలోపల కర్ణునిశక్తి అధికముగా ఉంటున్నాది. అర్జునుని శక్తి అంత అధికంగా లేదు. అస్త్రశస్త్ర విద్యలందు కర్ణుడే వీరుడుగా కనుపించాడు. కర్ణుడే అధికుడుగా కనుపించాడు. కానీ అర్జునునికంటె అధికశక్తి గలిగిన కర్ణుడు కడపటికి యేమయ్యాడు? దుష్టశక్తులనాశ్రయించాడు. దుష్టులు, దుర్మార్గులు అన్యాయము అనాచారములతో ఉండిన కౌరవులను ఆశ్రయించాడు.

srisathyasaivachanamrutam

అర్జునుడు నిస్వార్థము, నిరహంకారము, ప్రేమతత్త్వము, సత్యతత్త్వముతో కూడిన దైవమును ఆశ్రయించాడు. ఎన్ని శక్తులు ఉండినప్పటికి, ఆశ్రయించిన వారి శక్తి చాలా అల్పము కనుక, కర్ణుడుకూడను వారి గతినే పొందాడు.

**భుజబలంబు మంచి బుద్ధి బలంబుండి**
**దైవబలంబులేక దీనుడగును**
**కర్ణుడంతటివాడు కడపటి కేమయ్యె**
**మరువబోకుడిట్టి మంచిమాట.**

యిన్ని శక్తులుండి కర్ణుడు యేమైపోయాడు? దైవమును ఆశ్రయించలేదు. దైవప్రేమకు పాత్రుడు కాలేదు. ఎన్ని శక్తులుండి యేమి ప్రయోజనము? భారత, భాగవత, రామాయణ, యితిహాస, పురాణములన్నియుకూడను యిలాంటి పవిత్రమైన నీతులను బోధించి మానవత్వమును వికసింపచేసి పశుత్వమును నిర్మూలము గావిస్తూ వచ్చాయి.

**భగవంతునికి దగ్గర కావాలంటే ముందుగా మనలో దుర్భావములను దూరము చేసుకోవాలి**

మనము అనేక జన్మలనుండి యీ ప్రాకృతమైన జీవితములను గడుపుతూ రావటంచేత ప్రాకృత భావములే మనలో ప్రవేశిస్తూ వచ్చాయి. దివ్యమైన, భవ్యమైన, నవ్యమైన, దైవముయొక్క ప్రేమతత్త్వాన్ని మనం అనుభవించలేకపోతున్నాము. ఎంతో కాలము చెరసాలలో కాలము గడిపిన వ్యక్తి, కఠినమైన నేలపై పవళించిన వ్యక్తి తన శిక్ష పూర్తికాగానే యింటికి వెళ్ళి పట్టుపాన్పులపైన పవళించినాడు. పట్టుపాన్పుపైన పవళించినా అతనికి నిద్ర రాకపోయింది. కఠిన నేలపైననే అతనికి హాయి అనిపించింది. అట్లే లోకవ్యవహారములోపల, గుణములలోపల, లోకసంబంధమైన కార్యములలో కాలము గడిపినవానికి పవిత్రమైన దివ్యభావములు ఏమాత్రము గిట్టవు. అతి మధురమైన భగవత్తత్త్వం అతనికి అర్థము కాదు. పరమ ప్రశాంతమైన భగవత్తత్త్వమును అతను అనుభవించలేడు. అంతకు పూర్వము అనుభవించిన దుర్భావములు, దురాలోచనలు, దుచ్చింతనలే దీనికి మూలకారణము. వాటిని యేనాడు పరిశుద్ధము చేసుకొనునో అప్పుడే యీ పవిత్రమైన భావములు అతనిలో ప్రవేశిస్తూ ఉంటాయి.

sri sathyasai vachanamrutam

**ఏమిలేని బుఱ్ఱలోన యేమైనను చేర్చవచ్చు**
**ఏమేమో నిండియున్న బుఱ్ఱ నింప వీలుకాదు**
**కలి బోధలు నిండియున్న తలబుఱ్ఱది ఖాళియగున**
**తలబుఱ్ఱది ఖాళికాక యిల సుకృతంబు నింపనగునా!**

ఈ పాత్రలో నీరు ఉందంటే, పాలు నింపాలంటే ముందుగా నీరును పారపోయాలి. అలాగే మనయందున్న దుర్గుణములు, దుర్భావములు, దురాలోచనలు మనము దూరము గావించుకున్నప్పుడే దైవత్వమునకు దగ్గరౌతాము. కనుక, మనము గావించుకోవలసినది యేమంటే దుర్భావములను దూరము చేసుకోవాలి.

## ప్రేమకు మించిన మార్గము మరొకటి లేదు

కృష్ణతత్త్వమనగా ఏమంటే ప్రేమతత్త్వమే! ప్రేమ అనగా యేమిటి? కేవలము దైవతత్త్వముతో కూడినదే ప్రేమ అవుతుందిగాని ప్రాకృతమైన తత్త్వముతో కూడినది ప్రేమకాదు, అనురాగమవుతుంది. ఈనాడు ప్రేమ అనే పేరుతో అనురాగమును అనుభవిస్తున్నారు, మానవులు. ప్రేమ పేరు చెబుతున్నారేగానీ అనుభవించేది అనురాగాలే! అనురాగమునకు ప్రేమ అనే బురఖా వేసుకున్నారు, చూశారా! మానవత్వములోపల రూపనామములు, వేషభాషలు మాత్రమే మనము చూస్తున్నాముగానీ, భావశుద్ధిని మనము గుర్తించటానికి ప్రయత్నించటం లేదు.

**ఆకుపచ్చ పక్షులన్ని చిలుకలవలె పలుకునా?**
**పూవులపై పారాడెడు పురుగులు తుమ్మెదలగునా?**
**పులిచర్మముగప్పినట్టి గాడిద తా పులియగునా?**
**ఏనుగంత బలిసియున్న పంది ఏనుగగునటయ్యా?**

కాదు, కాదు, కాదు. యివి పై వేషములేగానీ, స్వస్వరూపములు కావు. కనుక, స్వస్వరూప సందర్శనము కావాలనుకుంటే పై వేషములన్నీ తీసివేయాలి. ఈనాడు జగత్తంతయూ యీ విధమైన రోగముతోనే నిండియున్నది. ఈ రోగము నివారణ కావాలంటే పరిశుద్ధమైన ప్రేమతత్త్వము మనము పొందాలి. ఈ ప్రేమకు మించిన మార్గము మరొకటి లేదు. ఈ ప్రేమ

sri sathyasai vahini vachanamrutam

నిలవాలంటే మొట్టమొదట స్వార్థమును, అహంకారమును జయించాలి. యివి త్యజించినవాడే ప్రేమకు కొంతవరకైనా సమీపమునకు రాగలడు.

**ఆత్మభావములో ఉండేవారే గోపికలు**

విద్యార్థులారా! భక్తులారా! భగవత్ తత్త్వాన్ని గుర్తించటమంటే అంత సులభము కాదు. ఏదో గుర్తించినట్లుగా మీరు భావిస్తున్నారు. ఈ విధంగా అనేక జన్మలు ఎత్తినప్పటికి సత్యాన్ని గుర్తించుకోలేరు. తాత్కాలిక జీవితమును మీరు అనుభవిస్తున్నారు. యీ తాత్కాలిక జీవితమునకే సమీపముగా ఉంటున్నారు. యిది శాశ్వత సమీపత్వమును అందించలేదు. ఎవరు దీని నిమిత్తమై పాటు పడుదురో వారే అతి సమీపులవుతారు. కృష్ణతత్త్వములోపల అనేక యిలాంటి ఆదర్శములు నిరూపిస్తూ వచ్చాయి. గోపికలు తమ సర్వస్వాన్ని కృష్ణునికి అర్పితము చేస్తూ వచ్చారు. శ్రీకాంత్ చెప్పాడు. 'నీవే వృక్షమువైతే నేను పొదగా వచ్చి అల్లుకుంటాను' అని. యిలాంటి ఏకత్వమును గుర్తించి, అందించి, ఆశించి, ఆనందించి అనుభవించటానికి పూనుకున్నారు గోపికలు. గోపికలు అంటే ఎవరు? ఆత్మభావములో ఉండేవారే గోపికలు! ఈనాడు ఆత్మను చింతించకుండా మన జీవితమును వ్యర్థము గావించుకుంటున్నాము మనము. ఆత్మభావమును మనం చింతిస్తూ రావాలి. స్వార్థము ఉండవలసిందే! కానీ, ఎంతవరకో అంతే! దీనిని హద్దులో పెట్టుకోవాలి. సర్వకర్మలు భగవత్ ప్రీత్యర్థం గావించాలి. ఆ ప్రేమభావములో జీవించినవారే గోపికలు. వారు లోకబాధలకుగానీ, లోకనిందలకుగానీ. నిష్ఠూరములకు గానీ ఏ మాత్రము కృంగనివారు. ఒకరు మెచ్చుకోనీ, ఒకరు దూషించనీ, రెండింటిని లక్ష్యము చేసేవారు కాదు, గోపికలు. 'మమ్మల్ని కృష్ణుడు మెచ్చుకోవాలిగానీ, వీరి మెప్పులు, వారి మెప్పులు మాకెందుకు?' అనుకునేవారు. 'మీరు నావారు' అని ఒక్కతూరి కృష్ణునిచే అనిపించుకుంటే చాలు అని భావించేవారు.

**భగవంతుడు నావాడు అనుకోవటంవలన ప్రయోజనము లేదు; భగవంతుడు చెప్పాలి, వీడు నావాడని**

'భగవంతుడు నావాడు అనుకోవటంవలన ప్రయోజనము లేదు; భగవంతుడు చెప్పాలి

sri sathyasaivachanamrutam

వీడు నావాడ'ని. అప్పుడే దీనికి తగిన విలువ! అర్జునుడుకూడా ఎంతో కాలము అహంకారపడుతూ వచ్చాడు 'కృష్ణుడు నా స్నేహితుడు, నా బావమరిది; కృష్ణుడు మా బంధువు. కృష్ణుడు నా సారథి. కృష్ణుడు నా మిత్రుడు,' యీ రకముగా భావించుకుంటూ వచ్చాడు. ఎంతకాలము పాండవులు కృష్ణుని ఆ విధంగా భావిస్తూ వచ్చారో అంతకాలము కృష్ణతత్త్వాన్ని వారు అర్థము చేసుకోలేకపోయారు. అంతవరకు బావ, బావమరిదిగానే కృష్ణార్జునులు యిద్దరు జీవిస్తూ వచ్చారు. అర్జునుడు మహామేధావి. తన మేధాశక్తినంతా ఉపయోగించి కృష్ణునితో అనేక విధముల వాదోపవాదములు వేశాడు. యింక సరుకు తగ్గిపోయింది. అప్పుడింక తన మాటలు తగ్గించాడు. శరణాగతుడయ్యాడు. అప్పుడే 'కరిష్యే వచనం తవ' అన్నాడు. 'కృష్ణా! యికపైన నీ మాటను నేను అనుసరిస్తాను. నీ వచనమును నేను ఆచరిస్తాను, అనుసరిస్తాను' అన్నాడు. ఆ విధమైన వాగ్దానము చేసిన తరువాతనే కృష్ణునితత్త్వము చక్కగా గుర్తించుతూ వచ్చాడు. నీ మిత్రునికి నీవు ఒక జాబు వ్రాసి దానిని రిజిష్టరుపోష్టులో పంపావు. కానీ, ఆ రిజిష్టరు జాబు నీ మిత్రునికి చేరిందా లేదా అని తెలియాలంటే యేమి కావాలి? అక్కడనుండి నీకు యెక్నాలెడ్జ్‌మెంటు వాపసు రావాలి. ఈ యెక్నాలెడ్జ్‌మెంటు నీకు రాకుండా ఉండినంతవరకు నీ జాబు నీ మిత్రునికింకా చేరలేదు అన్నమాట. అదే విధముగా నీవు 'నాకు ప్రేమ ఉంది, ప్రేమ ఉంది' అనుకుంటున్నావు. కానీ నీ జాబు నాకు వచ్చి చేరి నాయొక్క యెక్నాలెడ్జ్‌మెంటు నీవు అందుకోవాలి. అప్పుడే దీనికి చేరినట్లు గుర్తు. అనగా 'భగవంతుడు నీవు నావాడు' అని చెప్పాలి. అది చెప్పకుండా ఉండినంతవరకు నీవు భగవంతునకు సంబంధించినవాడవు కానే కాదు.

### సాధించటానికి ప్రయత్నం చేస్తే ఎంతైనా నీవు సాధించవచ్చు

ఎప్పుడు నీవు అవుతావు? నీ సర్వస్వాన్ని భగవంతునికి అర్పితము గావించుకొని ఆత్మభావముతో నీవు జీవించినప్పుడే యిది సాధ్యమవుతుంది. ఇది అంత సులభమైన మార్గము కాదు. కానీ దానికి తగిన కృషి చేయాలి. నేను సామాన్య మానవుడను, నేను యింతటి ఘనకార్యము సాధించగలనా అని సందేహించనక్కరలేదు. పట్టు పడితే దేనినైనా సాధించవచ్చు. ఆ శ్రద్ధను అభివృద్ధి పరచుకోవాలి. 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం.' అప్పుడే

srisathyasaivachanamrutam

మనకు జ్ఞానం లభిస్తుంది. 'నాకు చేత కాదు నాకు చేత కాదు' అని చెప్పి వదలిపెడితే నీవు కేవలము హీనుడైపోతావు. ఉన్న శక్తినికూడను నీవు నిరుపయోగము గావించుకుంటావు. సాధించటానికి ప్రయత్నం చేస్తే ఎంతైనా నీవు సాధించవచ్చు. రెక్కలు ఉండికూడను గ్రద్ద ఎగరటానికి యిష్టము లేకపోతే ఒక యించైనా ముందుకు పోలేదు. చిన్న చీమ నడచటానికి ప్రయత్నిస్తే మైళ్ళదూరమైన నడుస్తుంది. కనుక, సాధించాలని సంకల్పము పెట్టుకుంటే మనము యేదైనా సాధించవచ్చు. కానీ, మానవత్వములో మధ్య మధ్య యీ అహంకారము అనేది ప్రవేశిస్తుంది. ఇది మహా రాక్షసి. యిది చాలా చెడ్డ జబ్బు. ఈ రోగము నివారణ కావాలంటే చాలా కాలము తీసుకుంటుంది. ఈనాడు లోకములో అన్ని జబ్బులకంటే అహంకారమనే జబ్బు మితిమీరిపోయింది. కనుక యీ అహంకారము పోవాలి. అహంకారమునకు అవకాశమే లేదు. దేనిని చూచి నీవు అహంకార పడుతున్నావు? నీ ధనమును చూచా? నీ ధనముకంటె అధిక ధనము కలిగినవారు యీ లోకములో ఎంతమంది లేరు? లేక నీ అందమును చూచా? నీకంటె అందమైనవారు యీ లోకములో ఎంతమంది లేరు? నీ చదువును చూచా? నీ కంటె మించి చదివినవారు యీ లోకములో ఎంతమంది లేరు? లేక నీ గుణము చూచా? నీకంటె ఉత్తమగుణములు కలవారు యీ లోకములో ఎంతమంది లేరు? దేనిని చూచి నీవు అహంకార పడుతున్నావు? యిదే పెద్ద రోగము. అజ్ఞానమనే రోగము. ఈ అహంకారమనే దానిని పూర్తిగా నిర్మూలనము చేయాలి. ఈ దేహము కేవలము ఒక పనిముట్టు. 'శరీరమాద్యం ఖలు ధర్మ సాధకం.' ధర్మము నాచరించే నిమిత్తము వచ్చింది దేహము. యీ భావముచేత నీవు చేస్తూ వస్తే తప్పక దైవత్వమును పొందగలవు. దైవత్వమునకు సమీపము కాగలవు.

**ప్రేమతత్త్వమును బోధించే నిమిత్తమే అవతారములు రావటం**

ప్రేమస్వరూపులారా! ఈ ప్రేమతత్త్వాన్ని మనము అనుభవించాలి. ప్రేమను మనము అనుభవించినామంటే ప్రపంచములో ద్వేషమనేదే ఉండదు. ద్వేషమనేదే లేకపోతే అల్లర్లు అనేవి జరగనే జరగవు. లోకములో ఎన్ని హింసలు జరుగుతున్నాయి? ఎన్ని క్రూరకృత్యములు జరుగుతున్నాయి? దీనికంతా కారణము ఏమిటి? దీనికి స్వార్థము, అహంకారమే

srisathyasaivachanamrutam

మూలకారణము. కనుక, యీ స్వార్థము. అహంకారము మొట్టమొదట కాల్చివేయాలి. అప్పుడే నిస్వార్థమనేది నీలో ఆవిర్భవిస్తుంది. ఈ విధమైన ప్రేమతత్త్వాన్ని ఆధారము చేసుకొని, ప్రేమభావమును మనము అభివృద్ధి గావించుకొని, ప్రేమ జీవితమునే గడిపి, ప్రేమలోనే మనము అంత్యము కావాలి. ఈ ప్రేమతత్త్వమును అనుభవించే సమయములో యే బాధలు మనను సమీపించవు. ప్రేమలేనివానికే అన్నీ బాధలు.

శ్రీకాంత్ చెప్పాడు, 'నీరజ దీపము అంటించుకుంటున్నప్పుడు ఆ దీపములో కృష్ణుని చూస్తూ తన వేలు కాలుతూ ఉండినా తనకు తెలియలేదు. తన దేహమునే మరచింది,' అని. అదీ నిజమైన ప్రేమతత్త్వము. దీపములో వేలు పెడితే కాలుతుందో యేమో అనే భయం నీలో ఉంటే నీకు భగవంతుడు కనుపించనే కనుపించడు. కారణం ఏమిటి? భగవంతునిపై ప్రేమకంటె నీ దేహముపై నీకు ప్రేమ ఎక్కువగా ఉంటున్నది. ఈవిధంగా అనిత్యము, అశాశ్వతము అయిన దేహభ్రాంతులను పెంచుకుంటున్నావు. నిత్యసత్యముతో కూడిన, ప్రేమతత్త్వముతో కూడిన ఆత్మతత్త్వమును విస్మరిస్తున్నావు. అట్టి ఏకత్వభావాన్ని మనం అనుసరించాలి. యిట్టి ప్రేమతత్త్వాన్ని ప్రబోధించే నిమిత్తమే అవతారములు రావటంకూడను. సర్వులయందు దైవత్వము ఉండినప్పటికిని దానిని గుర్తించలేక పోతున్నారు. నువ్వులలో నూనె ఉండినట్లుగా నీలో దైవము ఉన్నాడు. నువ్వులను పిండినప్పుడే ఆ నూనెతో తలంటుకోవచ్చుగానీ, నువ్వులతో నీవు తలంటుకోగలవా? నువ్వులనుంచి నూనె తియ్యాలి. ప్రతి మానవునకు కొన్ని కష్టాలు సంభవిస్తాయి.

**కష్టాలలోనే భగవంతునియందు ప్రేమ అధికము కావాలి**

**ఘృష్టం ఘృష్టం పునరపి పునః చందనం చారుగంధం**
**ఛిన్నఛిన్నం పునరపి పునః స్వాదు యిక్షుకాండం**
**దగ్ధం దగ్ధం పునరపి పునః కాంచనం కాంతి వర్ణం**
**నప్రాణాంతే ప్రకృతిః వికృతిః జాయతే ఉత్తమానాం**



srisathyasaivachanamrutam

చందనపు కట్టెను తిక్కుతూ తిక్కుతుండగా అందులోనుండి పరిమళ గంధము మనకు లభ్యమవుతుంది. చెఱకును నములుతూ, నములుతూ రాగానే చెఱకులోని తియ్యని రసము మనకు అనుభూతికి వస్తుంది. బంగారమును అగ్నిలో వేసి కాల్చినకొలది అందులో మాలిన్యము తొలగి అపరంజిగా ప్రకాశిస్తూ వస్తుంది. అటులనే ఉత్తముడైనవానికి అనేక కష్టములు కలిగేకొలది వానిలో ఉన్న పవిత్రమైన విశ్వాసము అభివృద్ధి కావలెనేగానీ క్షీణించరాదు. కష్టాలలో, దుఃఖాలలో భగవంతుని ప్రేమ తగ్గిపోతుందా? అటువంటివాడు దుష్టుడే, రాక్షసుడే! కష్టాలలోనే భగవంతునియందు ప్రేమ అధికము కావాలి. ఎట్లనగా బంగారము కాల్చినకొలది పరిశుద్ధమవుతుందిగానీ మాలిన్యము కాదు. మన భక్తిని మనమే ప్రమాణముగా నిర్ణయించుకోవచ్చు.

**యువకులు ఉత్తమ శీలగుణముతోకూడి ఆదర్శప్రాయులుగా రూపొందాలి**

ఈనాడు మనము మన దృష్టినంతా పలు విధములుగా ప్రసరింపచేసుకుంటున్నాము. రామాయణముకూడను యిలాంటి ఆదర్శమైన జీవితమును అనేక విధములుగా నిరూపిస్తూ వచ్చింది. రామ, లక్ష్మణ, సీతలు కారడవులందు కఠినమైన జీవితాన్ని గడుపుతూ వచ్చారు. వారి వయస్సు చూస్తామా చాలా చిన్న వయస్సే! 20, 21 సంవత్సరములు రామలక్ష్మణులకు. 16, 18 సంవత్సరములు సీతకు. ఈ ముగ్గురు ఒకే కుటీరమునందు జీవిస్తూ వచ్చారు. కాని, ఎన్ని సంవత్సరములు కలసి జీవించినప్పటికిని లక్ష్మణుడు తన వదినయైన సీతముఖము యేనాడు చూచి ఉండలేదు. ఇలా ఉండగా ఒకరోజున రావణుడు సీతను అపహరించినాడు. తరువాత రామలక్ష్మణులు సీతను వెదకుతూ ప్రయాణమై పోతున్నారు, అరణ్యములో. తిరిగి హనుమంతుడు, సుగ్రీవుడు స్నేహమైన తరువాత వారితో సంభాషించు సమయములో సీతవియోగ బాధను లక్ష్మణుడు వారికి తెలియజేశాడు. అప్పుడు జ్ఞాపకం వచ్చి హనుమంతుడు ఒక మూట తెచ్చి యిచ్చాడు. 'ఒక రాక్షసుడు సీతను ఆకాశమార్గమున తీసుకొని పోతుండగా ఆమె క్రిందకు యీ మూటను విడిచింది. యిందులో ఆమె నగలు యేమైనా ఉన్నాయా చూడమ'న్నాడు.

sri sathyasai vahini amrutam

లక్ష్మణుడు ఏనాడు కన్నెత్తి సీతవైపు చూడలేదు, పాపం! ఇంతలో రాముడు 'లక్ష్మణా! యిందులో నీ వదిన నగలు యేమైనా ఉన్నవా చూడమ'న్నాడు. చూచాడు. ఆ నగలలో తాను గుర్తు పట్టగలిగిన ఒకే ఒక ఆభరణమును గురించి ఈవిధంగా చెప్పాడు:

**నాహం జానామి కేయూరే నాహం జానామి కుండలే**
**నూపురేత్వభిజానామి నిత్యం పాదాభివందనాత్.**

'అన్నా! యీ కంకణాలు నేను ఎప్పుడూ చూడలేదు. యీ చెవులపోగులు నేనెప్పుడు చూడలేదు. యివి నాకు తెలియదు కాని, యీ కాలి అందెలు మాత్రం సీతవేను' అన్నాడు. 'నిత్యము ఆమెకు పాదాభివందనము చేసే సమయంలో ఆ అందెలు మాత్రమే చూచినాను. యివి సీతవేను' అన్నాడు. చూశారా! యువకులు యీ సత్యాన్ని జాగ్రత్తగా గుర్తించాలి! 14 సంవత్సరములు సీతారాములతో కలిసి అరణ్యములో ఉండినప్పటికి ఆ తల్లియొక్క ముఖము ఒక్కనాడుకూడా చూచి ఉండలేదు, లక్ష్మణుడు. అట్టి శీలగుణము కలిగినవాడు లక్ష్మణుడు! ఒక్కతూరి 'వయస్సులో నేను పెద్దవాడు కావచ్చు. గుణముకంటె మరొకటి లేదు లోకములో! నీలాంటి గుణవంతుడు యీ లోకములో నాకు ఎక్కడా కానరాడు' అని ప్రశంసించాడు, రాముడు లక్ష్మణుని. అనగా భగవంతుడు గుణాన్ని మెచ్చుకుంటున్నాడేగానీ తన వయస్సునుగానీ, శక్తి సామర్థ్యములనుగానీ ఏమాత్రము చూడలేదు. ఇందుకు భిన్నంగా యీనాటి యువకులు మొదట చూచేది స్త్రీలయొక్క ముఖము. యిది ఎంత దుర్గుణమో చూచుకోండి! గుణశీలుడైనవాడు పాదములు చూడాలిగాని, ముఖము చూడకూడదు. యీనాడు మీ మాటలు, పాటలు, ఆటలు అన్నీకూడను ఒక విధమైన మాలిన్యముతో కూడినటువంటివే! అన్నీ కలుషితమైనటువంటివే! గాలి అపవిత్రముతో కూడినటువంటిదే! మాటలు అపవిత్రముతో కూడినటువంటివే! చూపులు అపవిత్రముతో కూడినటువంటివే! వినికిడి అపవిత్రముతో కూడినటువంటిదే! యింక యీ చేతులు ఎన్ని పాపాలకో గురి అవుతున్నాయి! శీలరహితమైన యీ యువత ఎందుకుండాలి? యువకులు ఆదర్శప్రాయులుగా రూపొందాలి. అప్పుడే భారతదేశముయొక్క సంస్కృతిలో

sri sathyasai vachanamrutam

మహోన్నతమైన రామచరిత్రను చక్కగా చాటినవారము, ఆచరించి అందించినవారము అవుతాము. ప్రతి ఒక్క విద్యార్థి ఒక ఆదర్శప్రాయుడైన విద్యార్థిగా రూపొందాలి. కానీ అది ఏమాత్రము సాధ్యమగుటలేదు. దీనికి అనేక రకములైన కారణములు అంతా ఉంటాయి. దీనిలో సహవాస దోషాలుకూడా ఉంటాయి. యీ సహవాస దోషముతోనే సర్వము క్షీణించి పోతున్నాది.

**ఎలాంటి గుణములు కలవారితో స్నేహము చేస్తామో అలాంటి గుణములు మనకు వస్తుంటాయి**

పైకి పోవటానికిగానీ, అధోగతికి దిగజారిపోవటానికిగానీ యీయొక్క సంగదోషమే మూలకారణము. ధూళి ఉంటున్నది. యీ ధూళి గాలితో స్నేహము చేస్తే గగనమువరకు ఎగురుతుంది. పైకి ఎగరటానికి రెక్కలు లేవు, దానికి. గాలితో స్నేహమువల్ల గగనంవరకు పోయింది. నీటితో స్నేహము చేస్తే గుంతలో దిగిపోతున్నాది ఆ మట్టి. క్రిందికి దిగటానికి కాళ్లు లేవు దానికి. పైకి ఎగరటానికి రెక్కలు లేవు. ఎలాంటి గుణములు కలవారితో స్నేహము చేస్తామో అలాంటి గుణములు వస్తుంటాయి. కనుకనే Tell me your company, I shall tell you what you are అన్నారు. చెడ్డవారితో సహవాసము చేసినప్పుడు మనముకూడను చెడ్డ అయిపోతాము. తెల్లని చొక్కా వేసుకొని కంసాలి బంగారు పని చేస్తుంటాడు. కొలిమిని ఒక గొట్టముతో ఊదుతూ ఊదుతూ ఉంటాడు. అక్కడ బొగ్గుతో సహవాసముతో ఉన్నాడు కనుక అతని తెల్లబట్ట నల్లగా మారిపోతుంది! ఆ ఊదినప్పుడుఅంతా బొగ్గుయొక్క కణములు చొక్కాపైన పడిపోతున్నాయి. తాను చేసేది బంగారుపనే! కాని, ఆ బొగ్గుయొక్క ధూళి అంతా తనపైన వచ్చి పడిపోతున్నది. సహవాసము దానికి కారణము. కనుక, మనము సత్సంగములో చేరాలి. అప్పుడే మనము సద్గుణవంతులుగా రూపొందవచ్చును. ప్రేమతత్త్వమును ప్రవేశపెట్టండి! ప్రేమగలవారితోనే సంబంధము చేసుకోండి! ప్రేమ అనగా లౌకికమైనది కాదు, దైవత్వముతో కూడినది.

**మానవత్వమునందు శేషించియున్న పశుత్వమును నిర్మూలించి దివ్యత్వముగా**

srisathyasaivachanamrutam

**రూపొందింపజేసుకోవటమే ఆధ్యాత్మికము**

ఆధ్యాత్మికము, ఆధ్యాత్మికము అనుకుంటున్నాం. ఆధ్యాత్మికమంటే ఏమిటి? భజనలు చేయటమా ఆధ్యాత్మికము? పూజలు చేయటమా ఆధ్యాత్మికము? జపము చేయటమా ఆధ్యాత్మికము? ధ్యానము చేయటమా ఆధ్యాత్మికము? యిది ఆధ్యాత్మికమే కాదు. దానికి యివన్నీ ఉపాంగములు. ఆధ్యాత్మికమనగా దీనికి సరైన అర్థము ఏమిటి? మానవత్వమునందున్న పశుత్వమును నాశనము చేసి, దివ్యత్వముగా రూపొందింపచేసుకోటమే ఆధ్యాత్మికము. ఈనాడు జపాలు, ధ్యానాలు, యోగాలు, భజనలు అన్నీ చేస్తూనే ఉంటున్నాము. కాని, మనలో ఉన్న పశుత్వము ఏమాత్రము తగ్గలేదు. కృతయుగ, త్రేతాయుగ, ద్వాపరయుగములందు దుర్మార్గులు, దుర్మార్గులుగానే కనిపిస్తూ వచ్చారు. ధర్మరాజు ధర్మరాజుగానే నిరూపిస్తూ వచ్చాడు. శకుని శకునిగానే నిరూపిస్తూ వచ్చాడు. దుర్యోధనుడు దుర్యోధనుడుగానే ప్రవర్తిస్తూ వచ్చాడు. కానీ యీ కలికాలములో వేషము ధర్మరాజు, కానీ చేష్టలు దుర్యోధనుని చేష్టలు. కనుకనే ఒక కవి చెప్పాడు, 'పేరు ధర్మరాజుగానీ రాక్షసపనులు చేస్తున్నాడు,' అని. మానసికతత్త్వమును మనము చక్కగా గుర్తించుటకు ప్రయత్నించాలి. భక్తి, ఆధ్యాత్మికమంటే యిది కాదు. మొట్టమొదట మనలోని పశుత్వము నాశనము చేసుకోవాలి. ఈ పశుత్వమంటే ఏమిటి? 'ఆహారనిద్రాభయమైథునాని,' పశువుకు, మనిషికి ఈ నాలుగు ఒక్కటే! కానీ 'జ్ఞానం నరాణాం అధికం విశేషః-జ్ఞానశూన్యః పశుభిస్సమానః.' మనలో యీ పశుత్వము అనేది ఉండటంచేత ఎన్ని చేసినా అన్నీ నిరుపయోగమైపోతున్నాయి. కనుక, ఈ పశుత్వమును మొట్టమొదట నిర్మూలము చేసుకోవాలి. మనం మానవుడనే తత్త్వమునుంచి దివ్యత్వమునకు ఎదగాలి. అదీ సరైన భక్తికి లక్షణం! వేషాలు వేస్తే ఉపయోగము లేదు. భాషను ఉపయోగపెడితే ఉపయోగము లేదు. చేష్టలలో మనం నిరూపించాలి. యిదియే నిజమైన భక్తికి గుర్తు!

**(తేదీ 21-08-1992న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasaivachanamrutam